నమస్తే తెలంగాణ



## కోతకు గురైన ఎస్సారెస్పీ కాల్వ



కాల్వకు పడిన బుంగ

సంగెం, సెప్టెంబర్ 15: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎస్సారెస్పీ ప్రధాన కాల్వకు బుంగ పడింది. మండలంలోని వెంకటాపూర్-కుంటపల్లి గ్రామాల మధ్య ఉన్న కాకతీయ కాల్వను చాలా ఏళ్ల తర్వాత నిర్మించారు. టెక్స్‌టైల్ పార్కు సమీపంలో ఎస్సారెస్పీ కాల్వ వెంకటాపురం బ్రిడ్జి ఎస్ జీఎం 128 విద్యుత్ స్తంభం వద్ద ఇటీవల భారీ వర్షాలకు కోతకు గురై బుంగ పడింది. వెంటనే అధికారులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

*గండిని పూడ్చివేయాలి*

ఖానాపురం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాకాల ఆయకట్టు తుంగబంధం కాల్వకు జీరోకట్టు వద్ద పడిన గండిని వెంటనే పూడ్చివేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. గండితో నీరంతా వృథాగా పోతున్నదని, తద్వారా పంట పొలాలకు నీరందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి గండిని పూడ్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## వేడినీళ్లు పడి చిన్నారి మృతి



చిన్నారి రిత్విక (ఫైల్)

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 15: వేడి నీళ్లు మీద పడి చిన్నారి మృతిచెందిన విషాద ఘటన వరంగల్ దేశాయిపేటలో ఆదివారం జరిగింది. ఈ నెల 10న ఉదయం దేశాయిపేటకు పెనుకుల రిత్విక(6) అనే చిన్నారికి స్నానం చేయించడానికి తల్లి వేడి నీళ్ల బకెట్‌ను డ్రమ్ముపై పెట్టింది. చిన్నారి బకెట్‌ను లాగడంతో వేడినీళ్లు శరీరం మీద పడ్డాయి. తీవ్ర గాయాలు కావడంతో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. చిన్నారి పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. చివరకు చిన్నారి చికిత్స పొందుతూ మృతిచెందింది. కళ్ల ముందే కన్నబిడ్డ కన్ను మూయడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

నల్లబెల్లి, సెప్టెంబర్ 15: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో ఆదివారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గోవిందాపురం గ్రామానికి చెందిన కుంజ సునీల్(30) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. అలాగే, తన 8నెలల చిన్న కుమారుడు తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో వైద్యం కోసం రూ.లక్ష అప్పు చేశా డు. తన కుమారుడి ఆరోగ్యం కుదటపడలేదు. మెరుగైన వైద్యం చేయించే స్తోమత లేక మనస్తాపంతో శనివారం సునీల్ క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## అలరించిన సాహిత్య, సంగీత సమ్మేళనం



రమాదేవిని సన్మానిస్తున్న నిర్వాహకులు

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 15: తెలంగాణ రాష్ట్ర కవుల సంక్షేమ సంఘం, ఏకశిల కరౌకే క్లబ్ ఆధ్వర్యంలో హనుమకొండలోని మానసిక వైద్య నిపుణుడు జగదీశ్‌బాబు కళా వేదికలో ఆదివారం నిర్వహించిన సాహిత్య, సంగీత సమ్మేళనం అందరినీ ఆకట్టుకుంది. 15 మంది కవులు, 15 మంది గాయకులు పాల్గొని కవితలు, గానంతో ఆకట్టుకున్నారు. కవయిత్రీ, రచయిత్రీ, సామాజికవేత్త నెల్లుట్ల రమాదేవిని సన్మానించారు. సమ్మేళనంలో సంస్థల వ్యవస్థాపకులు సిరాజుద్దీన్, రాజ్‌కుమార్, విజయ్‌కుమార్, రవికుమార్, రేవతి పాల్గొన్నారు.

## బీసీ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నరేంద్రయాదవ్



నియామక పత్రం అందుకుంటున్న నరేందర్

ఖానాపురం, సెప్టెంబర్ 15: అశోక్‌నగర్‌కు చెందిన నీలారపు నరేందర్‌యాదవ్ బీసీ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేతులమీదుగా ఆయన హైదరాబాద్‌లో నియామక పత్రం అందుకున్నారు. శ్యామ్ యాదవ్, పులి శ్రీనివాస్‌గౌడ్, సారయ్య, మల్లేశం పాల్గొన్నారు.

# నేడు గణేశ్ నిమజ్జనం

- గ్రేటర్‌లో 21 చెరువుల వద్ద బల్దియా ఏర్పాట్లు
- కోట చెరువులో నిమజ్జనం నిషేధం
- హనుమకొండలో 14, వరంగల్‌లో 8 చెరువులు
- అందుబాటులో క్రేన్‌లు, తెప్పలు, గజ ఈతగాళ్లు
- విద్యుత్ లైట్ల వెలుగుల్లో నిమజ్జన ప్రాంతాలు



సిద్ధేశ్వర గుండం వద్ద సిద్ధంగా ఉంచిన వెదురుతెప్పలు, సిద్ధంగా ఉంచిన జేసీబీలు



చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద విద్యుత్‌దీపాలు

వరంగల్, సెప్టెంబర్ 15 : వరంగల్ నగరంలో సోమవారం జరిగే గణేశ్ నిమజ్జనానికి బల్దియా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలోని 22 చెరువుల వద్ద నిమజ్జనానికి సర్వం సిద్ధం చేశారు. రూ. 2కోట్లు వెచ్చించి హనుమకొండ ప్రాంతంలో 14 చెరువులు, వరంగల్‌లో 8 చెరువుల్లో గణనాథులను నిమజ్జనం చేయనున్నారు. ఈ ఏడాది కోట చెరువులో నిమజ్జనాన్ని నిషేధించారు. 28 క్రేన్లు, విద్యుత్ లైట్లు. తెప్పలు ఏర్పాటు చేశారు. ఎక్కువ సంఖ్యలో విగ్రహాల నిమజ్జనం జరిగే చిన్నవడ్డేపల్లి, ఉర్సు, బంధం చెరువు, సిద్ధేశ్వర గుండం వద్ద మూడు నుంచి నాలుగు క్రేన్లను అందుబాటులో ఉంచుతున్నారు. ప్రతి చెరువు వద్ద గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. ఇప్పటికే మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదాదేవీ, సీపీ అంబర్ కిశోర్ ఝా, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. హనుమకొండలోని బంధం చెరువు, పద్మాక్షి గుండం, గోపాల్‌పూర్, భీమారం, వంగపహాడ్, ఎల్లాపూర్, రాంపేట్, రాంపూర్, కడిపికొండ, సోమిడి, హసన్‌పర్తి, మడికొండ, సింగారం చెరువుల్లో గణేశ్ విగ్రహాల నిమజ్జనం చేయనున్నారు. వరంగల్ ప్రాంతంలో చిన్నవడ్డేపల్లి చెరువు, ఉర్సు, బెస్తం, కట్టమల్లన్న, అగర్తల, మామునూరు, తిమ్మాపూర్ చెరువుల వద్ద అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ సారి వరంగల్ కోట చెరువలో నిమజ్జనం నిషేధించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు నిషేధించినట్లు అధికారులు తెలిపారు. వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద కోట చెరువును సందర్శించి సమీప గణేశ్ మండపాల నిర్వాహకులకు చెరువులో నిమజ్జనం చేయొద్దని సూచించారు. చిన్న వడ్డేపల్లి చెరువులో నిమజ్జనం చేయాలని వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ ఒక ప్రకటనలో కోరారు. అక్కడ అదనంగా మరో నాలుగు క్రేన్లను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి 28 క్రేన్లను ఏర్పాటు చేశారు. వరంగల్ ప్రాంతంలోని చిన్న వడ్డేపల్లి చెరువు వద్ద 6, ఉర్సు చెరువు వద్ద 5, కట్టమల్లన్న చెరువు 2, బెస్తం, అగర్తల చెరువు వద్ద ఒక్కో క్రేన్‌ను ఏర్పాటు చేశారు. హనుమకొండ ప్రాంతంలోని బంధం చెరువు వద్ద 4 క్రేన్లు, సిద్ధేశ్వర గుండం (పద్మాక్షి) 3, హసన్‌పర్తి చెరువు 2, మడికొండ, భీమారం చెరువు వద్ద ఒక్కో క్రేన్, వెదురు బొంగులతో చేసిన తెప్పలను నిమజ్జనం కోసం అందుబాటులో ఉంచారు. గ్రేటర్ కార్పొరేషన్ అధికారులకు ప్రత్యేకంగా నిమజ్జన విధులను వేస్తూ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఉత్తర్వులు జారీ చేశారు. చెరువుల వద్ద డీఈ స్థాయి అధికారికి బాధ్యతలు అప్పగించారు. గ్రేటర్ పరిధిలో చిన్న, పెద్ద వినాయక విగ్రహాలు సుమారు 5వేల వరకు ఏర్పాటు చేసినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా తాగునీటి వసతి కల్పించారు. వందల సంఖ్యలో పారిశుధ్య కార్మికులకు నిమజ్జన కేంద్రాల వద్ద డ్యూటీలు వేశారు. నిమజ్జన చెరువులకు వెళ్లే రహదారుల పొడువునా లైటింగ్ ఏర్పాటు చేశారు. పోలీస్, ఇరిగేషన్ అధికారులను సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వర్తించాలని ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం తెల్లవారుజాము వరకు గణేశ్ నిమజ్జనం జరిగే అవకాముంటుందని అధికారులు భావిస్తున్నారు.

## గణపతి నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి



కరీమాబాద్: ఉర్సు చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్, బల్దియా కమిషనర్

ఖిలావరంగల్/కరీమాబాద్: గణేశ్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ సత్యశారద అన్నారు. చిన్నవడ్డేపల్లి చెరువు, బెస్తం చెరువు, ఉర్సు రంగసముద్రం, ఖిలావరంగల్ అగడ్తతోపాటు పలు నిమజ్జన చెరువులను జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్వినీ తానాజీవాకాడే, అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు కోట చెరువులో గణపతి విగ్రహాల నిమజ్జనం నిషేధించినట్లు చెప్పారు. దేశాయిపేటలోని చిన్న వడ్డేపల్లి చెరువులో నిమజ్జనం చేయాలని తెలిపారు. నిమజ్జనానికి పోలీసు బందోబస్తుతో సహా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. వరంగల్ ఇన్‌చార్జి ఆర్డీవో కృష్ణవేణి, వరంగల్, ఖిలావరంగల్ తహసీల్దార్లు ఇక్బాల్, బండి నాగేశ్వర్‌రావు, జీడబ్ల్యూఎంసీ, విద్యుత్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, ఫిషరీస్ అధికారులు, కార్పొరేటర్ మరుపల్ల రవి పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఏసీపీ నందిరాంనాయక్

## మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవం వాయిదా

నర్సంపేటరూరల్, సెప్టెంబర్ 15: నర్సంపేటలో మంగళవారం ప్రారంభం కానున్న మెడికల్ కాలేజీ అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. కళాశాలను గురువారం ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ మోహన్‌దాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## సీకేఎం కాలేజీ రిటైర్డ్ లెక్చరర్ మృతి



రామయ్య(ఫైల్)

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 15: వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రిటైర్డ్ లెక్చరర్ నామ జానకి రామయ్య(75) మృతి చెందారు. అమెరికాలో ఉన్న తన కుమార్తె ఇంటికి వెళ్లిన రామయ్య గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హనుమకొండ భవానీనగర్‌లో నివాసం ఉంటున్న ఆయన అంత్యక్రియలు సోమవారం పద్మాక్షమ్మ గుట్ట వద్ద జరగనున్నట్లు పేర్కొన్నారు.

## గౌడ సంఘం నూతన కమిటీ ఎన్నిక



గౌడ సంఘం నూతన కమిటీ ప్రతినిధులు

వర్ధన్నపేట, సెప్టెంబర్ 15: గౌడ సంఘం ఇల్లంద గ్రామ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సమ్మెట సూరి, ఉపాధ్యక్షుడిగా సట్ల సూరయ్య, ప్రధాన కార్యదర్శిగా పోశాల సూర్యనారాయణ, కోశాధికారిగా తాళ్లపెల్లి ఎల్లయ్య, కార్యవర్గ సభ్యులుగా సట్ల వెంకట్రాంనర్సయ్య, సట్ల సాయిలు, సమ్మెట సమ్మయ్య, కత్తి వేణు, పోశాల లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు.

## స్పృహ తప్పి పడిపోయిన వ్యక్తి ఎంజీఎంకు తరలింపు

గిర్మాజీపేట, సెప్టెంబర్ 15: వరంగల్ చౌరస్తాలోని కొండూరు వీధిలో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి స్పృహ తప్పి పడిపోగా స్థానికుడు గాదెగోని రాజు గమనించి సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే అధ్యక్షుడు కొన్‌నెడ్డి మల్లారెడ్డి, కమిటీ సభ్యుడు డాక్టర్ ఆడెపు రాజేంద్రప్రసాద్ 108 ద్వారా ఎంజీఎంకు తరలించారు. స్థానికులు రాజును అభినందించారు.

## అంతర్జాతీయ ఆధ్యాత్మిక జ్యోతిషుల సమ్మేళనానికి శ్రవణ్‌శాస్త్రి

నెక్కొండ, సెప్టెంబర్ 15: తమిళనాడులోని తిరువన్నామలైలో ఈనెల 22న జరగనున్న అంతర్జాతీయ హిందూ దేవాలయాల ఆధ్యాత్మిక జ్యోతిషుల సమ్మేళనానికి నెక్కొండకు చెందిన జ్యోతిష పండితుడు బూరుగుపల్లి శ్రవణ్‌శాస్త్రికి ఆహ్వానం అందింది. దేశంలోని వేద జ్యోతిష, వాస్తు పండితులు పాల్గొననున్నారు.

## సతీశ్‌మూర్తికి బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డు




అవార్డు అందుకుంటున్న సతీశ్‌మూర్తి

కరీమాబాద్, సెప్టెంబర్ 15: ఆలిండియా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ న్యూ ఢిల్లీ, డిజిటల్ శాటిలైట్ స్కూల్స్ హైదరాబాద్ వారు ఉత్తమ ప్రిన్సిపాల్స్, ఎడ్యుకేటర్ అవార్డు-2024 కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వరంగల్‌లోని కివీ పాఠశాల ప్రిన్సిపాల్ దాసి సతీశ్‌మూర్తికి ట్రస్మా రాష్ట్ర నాయకులు బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డు అందించారు. ఈ సందర్భంగా దాసి సతీశ్‌మూర్తి మాట్లాడుతూ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు.

## పాల కుమారస్వామికి పురస్కారం



కుమారస్వామిని సత్కరిస్తున్న నిర్వాహకులు

కరీమాబాద్, సెప్టెంబర్ 15: తెలుగు భాషా దినోత్సవం-2024ను పురస్కరించుకుని కాళోజీ కాలేజీ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా తెలుగు వెలుగు జాతీయ మహానంది పురస్కారం అందజేశారు. ఉర్సుకు చెందిన పాల కుమారస్వామి (రవి) మహానంది పురస్కారం అందుకున్నారు. తనకు అవార్డు రావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## నిషేధిత గుట్కా సీజ్

పర్వతగిరి, సెప్టెంబర్ 15: మండలకేంద్రానికి చెందిన దారం సోమయ్య వద్ద స్కూటీలో రూ. 8 వేల విలువైన గుట్కా, అంబర్ ప్యాకెట్లను ఆదివారం సీజ్ చేసి నట్లు ఎస్సై బోగం ప్రవీణ్ తెలిపారు. పర్వతగిరిలో పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించడంతో పట్టుకుని గుట్కాను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

# బంగారమే శ్రీరామరక్ష!



**ఆపత్కాలంలో** ఆదుకునేది బంగారం మాత్రమే. సమయానికి చేతిలో చిల్లిగవ్వ లేనప్పుడు ఈ పుత్తడే మీకు పరమాన్నంగా మారుతున్నది. ఆరోగ్యం బాగోలేక ఆసుపత్రి పాలైనప్పుడు ఈ గోల్డే మీకు ఆర్థికంగా ఆదుకుంటుంది. ఆర్థిక సంక్షోభం చుట్టుముట్టినప్పుడు బంగారమే శ్రీరామరక్ష. సామాన్యుడి నుంచి మొదలుకొని సంపన్నవర్గాలు కూడా ప్రతియేటా బంగారం ఎంతోకొంత కొనుగోలు చేస్తున్నారు. అక్కరకు వచ్చినప్పుడు ఈ గోల్డ్‌ను తాకట్టుపెట్టుకొని రుణాలు తీసుకుంటున్నారు. వీటికోసం బ్యాంకులతోపాటు ఆర్థిక సేవల సంస్థలు ప్రత్యేకంగా పసిడిపై రుణాలు మంజూరు చేస్తున్నాయి. సెక్యూర్డ్ రుణాలు కావడంతో బంగారం విలువలో 80 శాతం వరకు రుణాలు మంజూరు చేస్తున్నాయి బ్యాంకులు, ఆర్థిక సేవల సంస్థలు. బంగారం కడ్డీలతోపాటు ఆభరణాలు తాకట్టుపెట్టుకొని కేవలం కొన్ని నిమిషాల్లోనే రుణం పొందవచ్చును. వ్యక్తిగత రుణాలు, ఇతర రుణాలు తీసుకోవాలంటే రోజుల సమయం పడుతుంది కానీ, బంగారంపై రుణాలు తీసుకోవడం ఎంతో సులభం. పెద్దగా డాక్యుమెంట్లు లేకుండానే తీసుకోవచ్చును. తక్కువ వడ్డీకే రుణాలు తీసుకోవచ్చును. ఏయే బ్యాంకుల్లో ఎంత వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి. ప్రభుత్వరంగ బ్యాంకులతోపాటు ప్రైవేట్ రంగ బ్యాంకులు 8 శాతం మొదలు కొని 24 శాతం వరకు వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి. తీసుకున్న రుణాలను ఏడాదిలోగా చెల్లించాల్సి ఉంటుంది. లేకపోతే బ్యాంకులు తాకట్టుకింద పెట్టిన ఆభరణాలను జప్తు చేసుకొని వేలం వేసుకునే అధికారం ఉంటుంది. పసిడి విలువను గుర్తించడంలో ఒక్కో బ్యాంకుది ఒక్కో తీరుగా ఉంటుంది.

**పసిడి రుణాలపై ఏయే బ్యాంకుల్లో ఎంత వడ్డీ**

| బ్యాంక్ | వడ్డీరేటు(శాతంలో) | ప్రాసెసింగ్ ఫీజు |
|---|---|---|
| కొటక్ మహీంద్రా | 8 నుంచి 24 వరకు | 2 శాతం+జీఎస్టీ |
| హెచ్‌డీఎఫ్‌సీ | 8.30 నుంచి 16.55 వరకు | ఒక్క శాతం |
| సెంట్రల్ బ్యాంక్ | 8.40 నుంచి 9.25 వరకు | రుణంపై అరశాతం |
| యూకో | 8.50 | రూ.250-5 వేల వరకు |
| ఇండియన్ బ్యాంక్ | 8.80 నుంచి 9 వరకు | రుణంపై 0.56 శాతం |
| యూనియన్ బ్యాంక్ | 8.65 నుంచి 9.90 వరకు | - |
| ఎస్బీఐ | 8.70 | అర శాతం+జీఎస్టీ |
| ఇండస్‌ఇండ్ | 8.75 నుంచి 16 వరకు | రుణంపై ఒక్క శాతం |
| బంధన్ బ్యాంక్ | 8.75 నుంచి 19.25 వరకు | ఒక్క శాతం+జీఎస్టీ |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 9.15 | వర్తించే చార్జిలు+జీఎస్టీ |
| పంజాబ్ నేషనల్ | 9.25 | రుణంపై 0.75 శాతం |
| బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర | 9.30 | రూ.500-2,000+జీఎస్టీ |
| ఫెడరల్ బ్యాంక్ | 9.49 | - |
| కెనరా బ్యాంక్ | 9.60 | రూ.500-5 వేల వరకు |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 10 | రుణంపై ఒక్క శాతం |

**క్రెడిట్ స్కోర్ అక్కర్లేదు..**

సిబిల్ స్కోర్ లేకుండానే బంగారంపై రుణాలు తీసుకోవచ్చును. కేవలం బంగారం లేదా ఆభరణాలు తాకట్టు పెట్టుకొని రుణాలు తీసుకోవచ్చును. దీనికోసం వారి క్రెడిట్ స్కోర్ ఎంత ఉన్నదో అవసరం లేదు. 500 లోపు సిబిలి స్కోర్ ఉన్నవారు కూడా సులువుగా రుణాలు తీసుకోవచ్చును.

**కావాల్సిన డాక్యుమెంట్లు**

బంగారం తాకట్టుపై రుణాలు తీసుకోవడానికి పలు డాక్యుమెంట్లు అవసరం ఉంటాయి. వీటిలో ఆధార్ కార్డుతోపాటు పాన్ కార్డు, బ్యాంక్ ఖాతాతోపాటు కేవైసీ డాక్యుమెంట్ సమర్పించాల్సి ఉంటుంది. మనం తీసుకునే బ్యాంకులోనే ఖాతా ఉండాల్సి ఉంటుంది. ఇటీవలకాలంలో బ్యాంకులతోపాటు పసిడిపై రుణాలు ఎన్‌బీఎఫ్‌సీలు కూడా ఇస్తున్నాయి.

**తిరిగి చెల్లింపులు ఎలా..**

బంగారంపై తాకట్టుపై రుణాలు తీసుకున్నవారు మూడు రకాలుగా తిరిగి చెల్లింపులు జరుపుకునే అవకాశాలను బ్యాంకులు కల్పించాయి. వీటిలో నెలవారి చెల్లింపుల రూపంలో చెల్లింపులు జరుపుకోవచ్చును, లేదా మూడు నెలల్లో వడ్డీతో సహా తీసుకున్న రుణాన్ని చెల్లించవచ్చును. అలాగే ఆరు నెలలు, ఏడాది కాల పరిమితితో తీసుకున్న రుణాలను వడ్డీతో కలుపుకొని చెల్లించుకోవచ్చును. ఒకవేళ ఏడాది ముగిసిన తర్వాత తీసుకున్న రుణానికి వడ్డీని చెల్లించి మళ్లీ రెన్యూవల్ చేసుకోవచ్చు.







## ఫెడ్ నిర్ణయమే కీలకం..

**దేశీయ** స్టాక్ మార్కెట్లు లాభాల జోష్‌లో సాగుతున్నాయి. మదుపరులు పెట్టుబడులకు మద్దతు పలుకుతున్నారు. గత వారం ట్రేడింగ్‌లో గురువారం ఒక్కరోజే సెన్సెక్స్ 1,440, నిఫ్టీ 470 పాయింట్లు పెరిగాయి. ఈ క్రమంలోనే వారం మొత్తంగా సూచీలు భారీ ఎత్తున పుంజుకోగలిగాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,707.01 పాయింట్లు ఎగిసి 82,890.94 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 504.35 పాయింట్లు ఎగబాకి 25,356.50 దగ్గర ముగిసింది. మునుపెన్నడూ లేనివిధంగా సెన్సెక్స్ తొలిసారి 83వేల మార్కును అధిగమించింది. నిఫ్టీ సైతం నూతన గరిష్ఠాలను తాకింది. ఈ నేపథ్యంలో ఈ వారం అమ్మకాల ఒత్తిడికి ఆస్కారం కనిపిస్తున్నది. శుక్రవారమే మార్కెట్లలో సెల్లింగ్ ప్రెషర్ ఉండటాన్ని గమనించవచ్చు. పారిశ్రామికోత్పత్తి మందగించడం, ద్రవ్యోల్బణం మళ్లీ విజృంభిస్తున్న సంకేతాలు రావడంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు బ్రేక్ వేయవచ్చన్న అభిప్రాయాలను మెజారిటీ నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. పైగా సూచీలు ఆల్‌టైమ్ హైల్లో ఉండటం కూడా లాభాల స్వీకరణకు తావిస్తోందంటున్నారు. ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య సమీక్ష ప్రభావం కూడా కనిపించనున్నది. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,900 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,700 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,700–25,900 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

**చివరగా..**

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఏ బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

## యూబీఐ ప్రత్యేక డిపాజిట్ స్కీం

**ప్రభుత్వ** రంగ సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిట్లను ఆకట్టుకోవడానికి ప్రత్యేక డిపాజిట్ స్కీంను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. 333 రోజుల కాలపరిమితితో యూనియన్ సమృద్ధి స్కీంపై అధిక వడ్డీ రేటును ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. ఈ స్కీంలో కనీసంగా రూ.1,000 నుంచి రూ.3 కోట్ల లోపు డిపాజిట్ చేయవచ్చును. ఈ స్కీంపై సాధారణ ప్రజలకు 7.40 శాతం వార్షిక వడ్డీని చెల్లిస్తున్న బ్యాంక్..సీనియర్ సిటిజన్లకు 7.90 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 8.15 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. మెచ్యూర్ కాకముందే ఈ డిపాజిట్లను విత్‌డ్రా చేసుకునే అవకాశాన్ని బ్యాంక్ కల్పించింది. కానీ, ఇలా చేసుకుంటే ఒక్క శాతం వడ్డీని తగ్గి చెల్లించనున్నది. ఈ డిపాజిట్ స్కీంను ఎంచుకోవడానికి బ్యాంక్ శాఖ లేదా వెబ్‌సైట్ ద్వారా డిపాజిట్ చేయవచ్చును.

## కొత్త పీపీఎఫ్ రూల్స్

**అక్టోబర్ 1 నుంచి అమల్లోకి..**

**పబ్లిక్** ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) ఖాతాలను మైనర్ల కోసం కూడా తెరుచుకోవచ్చు. మారిన నిబంధనల ప్రకారం సదరు మైనర్లకు 18 ఏండ్లు నిండేదాకా ఈ ఖాతాలు పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ వడ్డీ రేటుతో కొనసాగుతాయి. మైనార్టీ తీరిన తర్వాత పీపీఎఫ్ ఖాతాగా మార్చుకోవచ్చు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇక ఒకటికి మించి పీపీఎఫ్ ఖాతాలనూ తెరుచుకోవచ్చు. అలాగే ప్రవాస భారతీయులు (ఎన్నారైలు) పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ స్కీం (పీపీఎఫ్) 1968 కింద క్రియాశీల పీపీఎఫ్ ఖాతాలను తెరిస్తే ఫామ్ హెచ్ ద్వారా ఖాతాదారుని నివాస హోదా గురించి అడగకపోతే పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ మార్గదర్శకాల ప్రకారం ఈ నెలాఖరుదాకా ఉండే వడ్డీరేట్లు వర్తిస్తాయి. పీపీఎఫ్ అనేది కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సాధనం. అంతేగాక మదుపరులను దీర్ఘకాలిక ఆకర్షణీయ ప్రయోజనాలతో కూడిన సేవింగ్స్, పెట్టుబడులకు ప్రోత్సహించే పథకం ఇది. దీనికి ఆదాయ పన్ను (ఐటీ) మినహాయింపులూ వర్తిస్తాయి.

# షార్ట్-టర్మ్ ఆరోగ్య బీమా

### లాభాలు, పరిమితులు తెలుసా?



**షార్ట్-టర్మ్** ఆరోగ్య బీమా తాత్కాలిక కవరేజీని కల్పిస్తుంది. దీన్నే టర్మ్ మెడికల్ ఇన్సూరెన్స్ అని కూడా పిలుస్తారు. సాధారణంగా ఇది కొద్ది నెలల నుంచి ఏడాదిదాకే ఉంటుంది. ఎవరైతే స్టాండర్డ్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలతో వచ్చే దీర్ఘకాలిక ఆరోగ్య బీమాలు కాకుండా తక్షణ కవరేజీలను కోరుకుంటారో వారినుద్దేశించినదే ఈ పాలసీ. సమగ్ర కవరేజీని కొనలేనివారికి కూడా ఇది ఉపయుక్తంగా ఉంటుంది. కంపెనీల్లో గ్రూప్ ఇన్సూరెన్స్ కోసం వేచిచూస్తున్న ఉద్యోగులు, నిరుద్యోగులకు దీని అవసరం ఎక్కువని చెప్పవచ్చు.

**షార్ట్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్ శైలి**

- కేవలం కొద్ది నెలల నుంచి ఏడాది వరకే బీమా కవరేజీ.
- లాంగ్-టర్మ్ ప్లాన్లతో పోల్చితే షార్ట్-టర్మ్ ప్లాన్లకు ప్రీమియంలు తక్కువే.
- ఇప్పటికే ఉన్న ఆరోగ్య సమస్యలకు బీమా కవరేజీ ఉండకపోవచ్చు. కొన్ని రకాల చికిత్సలకూ వీలుండదు.
- కనీస ఆరోగ్య సమాచారంతో ఈ ప్లాన్లను తీసుకోవచ్చు.
- పరిమిత స్థాయిలోనే ఈ ప్లాన్ల చెల్లుబాటు ఉంటుంది. ఎంపిక చేసిన నెట్‌వర్క్‌లో తప్ప.. అన్ని దవాఖానల్లో చెల్లవు.
- లాంగ్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలను రెన్యువల్ చేసుకున్నట్టుగా ఈ షార్ట్-టర్మ్ పాలసీలను రెన్యువల్ చేసుకోలేం.

**చివరగా..**

షార్ట్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్‌లు తక్షణ అవసరాలకే పనికొస్తాయి. కాబట్టి లాంగ్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్‌లకే ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడే దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలను పొందుతాం. ప్రీమియంలు ఎక్కువైనప్పటికీ క్లెయిములు లేకపోతే కవరేజీలు పెరిగే ప్రయోజనం ఉంటుంది. మెటర్నిటీ, మెంటల్ హెల్త్ తదితర అవసరాలు, సమస్యలకూ స్టాండర్డ్ హెల్త్ ఇన్సూరెన్స్‌లే లాభదాయకం అని స్పష్టంగా చెప్పవచ్చు. అందుకే సమగ్ర ప్యాకేజీని తీసుకోవడం మరువద్దు.